నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, ఆదివారం 14 జూలై 2024 | HYDERABAD

దట్టీలు సమర్పిస్తున్న నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

శాంతి మార్గాన్ని స్వీకరించాలి

నగర సీపీ శ్రీనివాస్‌రెడ్డి

చార్మినార్, జూలై 13 : మొహర్రం త్యాగానికి ప్రతీకగా నిలుస్తుందని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన డబీర్‌పురలోని చారిత్రక బిబికా అలవా అషూర్‌ఖానాలో ప్రతిష్ఠించిన అలంలకు నగర పోలీస్ విభాగంలోని ఉన్నతాధికారులతో కలిసి దట్టీలు సమర్పించారు. ఈ సందర్భంగా సీపీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మానవాళి శాంతి కోసం త్యాగధనులు చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ స్వీకరించాలని తెలిపారు. కాగా, చారిత్రక బిబికా అలవా నుంచి ప్రారంభమయ్యే మాతం ఊరేగింపు అలీజా కోట్ల, చార్మినార్, గుల్జార్‌హౌస్, మీరాలం మండి, దారుల్ షిఫా, కాలికబర్ మీదుగా చాదర్‌ఘాట్ వరకు కొనసాగనున్నది. ఈ నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి మాతం ఊరేగింపు కొనసాగే మార్గాన్ని పరిశీలించారు. చార్మినార్, గుల్జార్‌హౌస్ వద్ద చేపట్టాల్సిన జాగ్రత్తలను అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు స్నేహమేరా, కాంతిలాల్ పాటిల్, అడిషనల్ డీసీపీ షేక్ జహంగీర్ పాల్గొన్నారు.

వర్షసూచన

సిటీబ్యూరో, జూలై 13 (నమస్తే తెలంగాణ): రుతుపవనాల ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 30.4, కనిష్ఠం 24.0 డిగ్రీలు, గాలిలో తేమ 64 శాతంగా నమోదైనట్లు తెలిపారు.

నిరుద్యోగుల రణనినాదం

నిరుద్యోగులకు వ్యతిరేకంగా సీఎం రేవంత్‌రెడ్డి శనివారం జేఎన్టీయూలో చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అశోక్‌నగర్‌లో పెద్ద ఎత్తున నిరసన తెలుపుతున్న గ్రూప్-1,2,3 అభ్యర్థులు

అలరించిన నృత్యరూపకం

కొండాపూర్, జూలై 13 : భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలపై ఉన్న మక్కువతో విదేశాల్లో ఉన్నప్పటికీ తనకు ఇష్టమైన కూచిపూడి నృత్యంలో ఎంతో మందికి శిక్షణ నిస్తూ, నృత్యకారులుగా తీర్చిదిద్దుతున్న నాట్య గురువులు ప్రీతి తాతంబొట్ల మాదాపూర్‌లోని శిల్పారామంలో తమ శిష్య బృందంతో కలిసి ప్రత్యేక నృత్య ప్రదర్శనిచ్చారు. శనివారం వారాంతపు సాంస్కృతి ప్రదర్శనల్లో భాగంగా శిష్య బృందంతో కలిసి వివిధ అంశాలపై ఇచ్చిన నృత్యప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నది.

నేడు ఆటో డ్రైవర్ల దీనస్థితిగతులపై..

సిటీబ్యూరో, జూలై 13 (నమస్తే తెలంగాణ) : ఆటో డ్రైవర్ల దీనస్థితిగతులపై ఆదివారం గ్రేటర్ హైదరాబాద్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో ఉదయం 10:30 గంటలకు సమావేశం జరగనున్నది. ఈ మేరకు తెలంగాణ ఆటో మోటార్ డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసుల వేధింపులు, ఫైనాన్స్ బెదిరింపులు, ఉపాధి లేకుండా చేసిన కాంగ్రెస్ మోసాలపై ముఖ్య నాయకులతో చర్చించి సమస్యల పరిష్కారానికి పోరాటం ఉధృతం చేసే కార్యాచరణ సిద్ధం చేయబోతున్నట్టు చెప్పారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల ముఖ్య నాయకులు ఇందులో పాల్గొంటారని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన మోసపూరిత హామీలతో ఆటో డ్రైవర్ల బతుకులు ఆగమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఇప్పటికే అనేక హామీలు ఇచ్చారని, ఒక్కటి కూడా నెరవేర్చలేదని ఆయన విమర్శించారు.

గ్రూప్-1కు ఉచిత శిక్షణ

మేడ్చల్ కలెక్టరేట్, జూలై 13 : అర్హులైన మైనార్టీ గ్రూప్ -1 అభ్యర్థులకు ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 19 వరకు గడువు ఉన్నదని, 22వ తేదీ నుంచి తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్‌లో తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 040-23236112 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నాలా భద్రతకు.. బల్దియా చర్యలు

సిటీబ్యూరో, జూలై 13 (నమస్తే తెలంగాణ) : వర్షాకాలం నేపథ్యంలో వచ్చే వరదలతో ప్రమాదాలు, వరద నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు బల్దియా అధికారులు వెల్లడించారు. జీహెచ్ఎంసీ పరిధిలో 1302 కిలోమీటర్ల పొడువునా వరద కాలువ ఉన్నదని, ఇందులో 390 కిలోమీటర్ల మేర మేజర్ కాలువ ఉన్నట్లు తెలిపారు. వర్షాల సందర్భంలో గానీ, ఇతర సమయంలో ఆస్తి, ప్రాణ, జంతు నష్టం లేకుండా అప్రమత్తంగా ఉండేందుకు నాలా భద్రత చర్యలతో ఎంతగానో ప్రయోజనం ఉంటుందన్నారు. ఇప్పటికే వరద నాలాల వెంబడి ఉన్న ప్రమాదకరమైన ప్రాంతాలను గుర్తించామని, ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలకు తావు లేకుండా మెష్, ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి జోన్‌లో గుర్తించిన ప్రమాద ఘంటికల వద్ద భద్రత చర్యలు తీసుకుంటామని, సర్కిల్ పరిధిలో ఒక నిర్వహణ విభాగం అసిస్టెంట్ ఇంజినీర్ అధికారికి కొన్ని కిలోమీటర్ల బాధ్యత అప్పగించినట్లు వివరించారు.

బంగారు పతకాలు, పట్టాలు పొందిన ఆనందంలో విద్యార్థులు

అట్టహాసంగా.. స్నాతకోత్సవం

శేరిలింగంపల్లి, జూలై 13: గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో శనివారం ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ట్రిపుల్ ఐటీ) 23వ స్నాతకోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ స్నాతకోత్సవంలో మొత్తం 600 మంది గ్రాడ్యుయేట్లు పట్టాలు అందుకున్నారు. వారిలో 125 మంది బీటెక్, 156 మంది ఎంటెక్, 16 మంది ఎంఎస్ఐటీపీ, 32 మంది పీహెచ్‌డీ పట్టాలను అందుకున్నారు. ట్రిపుల్ ఐటీలో విశేష ప్రతిభ చూపిన 13 మందికి బంగారు పతకాలు అందజేశారు. ప్రతిష్ఠాత్మక ట్రిపుల్ ఐటీ గోల్డ్ మెడల్‌ను ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్(ఈసీఈ) బీటెక్ విద్యార్థి యర్రమనేని జైష్ణవ్ సొంతం చేసుకున్నారు. ఉత్తమ ఆల్‌రౌండర్ గోల్డ్‌మెడల్‌ను కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) బీటెక్ విద్యార్థి తాటిపామూల హర్షవర్ధన్ అందుకున్నారు. అంతకుముందు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ కలైసెల్వీ విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కలైసెల్వీ మాట్లాడుతూ ఒకప్పుడు కంప్యూటర్ సైన్స్ అనేది కీలకంగా ఉండేదని, ఇప్పుడు ఏఐ, ఎంఎల్‌లు ముఖ్యభూమిక పోషిస్తున్నాయని చెప్పారు.

రాజకీయాల్లో స్థిరపడాలన్నదే నా లక్ష్యం

ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) బీటెక్‌లో ట్రిపుల్ఐటీ ఆల్‌రౌండర్‌గా గోల్డ్‌మెడల్ అవార్డును సొంతం చేసుకోవడం చాలా ఆనందంగా ఉన్నది. మా స్వస్థలం సిద్దిపేట, చేర్యాల పట్టణం. తల్లిదండ్రులు కృష్ణవేణి అంగన్‌వాడీ టీచర్, నాన్న వెంకటేశ్‌గౌడ్ రాజకీయ నేత. ఎప్పటికైనా రాజకీయాల్లో స్థిరపడాలన్నది నా లక్ష్యం. ప్రస్తుతానికి క్యాంపస్ సెలక్షన్‌లో భాగంగా సంవత్సరానికి 50 లక్షల వేతనంతో మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ సంస్థలో నాకు ఉద్యోగం లభించింది. భవిష్యత్‌లో మంచి రాజకీయ నాయకుడిగా కావాలన్నదే నా లక్ష్యం. **-తాటిపాములు హర్షవర్ధన్**

సీఈవోగా సేవలందించాలని ఉంది

ప్రతిష్ఠాత్మక ట్రిపుల్ ఐటీ గోల్డ్ మెడల్ అవార్డును ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్(ఈసీఈ) బీటెక్ సాధించడం ఎంతో సంతోషంగా ఉంది. మా స్వస్థలం ఏపీ. మేము చాలాకాలంగా హైదరాబాద్ మూసాపేట్‌లో స్థిరపడ్డాం. నాన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, అమ్మ గృహిణి. ఈసీఈలో మాస్టర్స్ చేయాలనుకుంటున్నా. ఎప్పటికైనా ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో సీఈవోగా స్థిరపడాలన్నది నా లక్ష్యం. **-యర్రమనేని జైష్ణవ్**

అత్యద్భుతంగా.. జంట నగరవాసులకు త్వరలోనే మరో రైల్వేస్టేషన్ అందుబాటులోకి రాబోతున్నది. చర్లపల్లి రైల్వే టెర్మినల్ ఇలా అత్యద్భుతంగా రూపుదిద్దుకుంటున్నది. నిర్మాణం దాదాపు పూర్తి కావొచ్చింది.

9 గంటలకుపైగా.. నిల్చొనే విధులు

లేట్‌నైట్ డ్యూటీతో పరేషాన్

ఉచిత బస్సు స్కీంతో పెరిగిన టికెటింగ్ ఇష్యూ భారం

పెద్ద అవరోధంగా టాయిలెట్ సమస్య.. సరిపడా నీళ్లు తాగలేని దుస్థితి

అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మహిళా కండక్టర్లు

సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

సిటీబ్యూరో, జూలై 13 (నమస్తే తెలంగాణ) : 'సమస్య చెప్పుకోవడానికి కూడా భయపడాల్సి వస్తున్నది. పనిభారం పెరుగుతుందని మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే లేడు. ఒక్క రోజు లీవ్ అడగాలంటే అది ఎవరైన చనిపోయారనే వార్తనే అయ్యిండాలి. డబుల్ డ్యూటీలు చేస్తేనే నెలలో ఒక్కరోజు లీవ్ దొరుకుతుంది. డ్యూటీ దిగే సరికి రాత్రి 11 అవుతుంది. భయభయంగా ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి మాది.'' అంటూ మహిళా కండక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లేట్‌నైట్ డ్యూటీలతో వాళ్లంతా పరేషాన్ అవుతున్నారు. 'గతంలో మార్నింగ్ డ్యూటీ చేసుకుని మధ్యాహ్నం ఇంటికి వెళ్లిపోయేవాళ్లం. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. రాత్రి 11 దాటుతోందని మిథాని డిపోకు చెందిన ఓ కండక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. బస్సుల సంఖ్య పెంచలేదు... కానీ ఉచిత బస్సు స్కీం పెట్టారు. ఒక్క బస్సులో 40-50 మంది ఎక్కడమే అధికం. అలాంటిది 150-200 మంది ఎక్కుతున్నారు. వారందరికీ టికెట్ ఇష్యూ చేయడం కత్తిమీద సాములాంటిది. ఈ క్రమంలో టికెట్ ఇష్యూలో తేడా వచ్చిందంటూ సస్పెన్షన్ విధిస్తున్నారు. ఇది మమ్మల్ని మానసికంగా ఆందోళనకు గురి చేస్తున్నది.' అని రాణిగంజ్ డిపోకు చెందిన ఓ మహిళా కండక్టర్ అభిప్రాయపడ్డారు. 'బస్సులో ఏకధాటిగా 9 గంటలు నిలబడుతున్నాం. ఏ కొంత సమయం కూడా కూర్చొనే వీలు లేకుండా పోయింది. ఉచిత బస్సు స్కీంతో బస్సులన్నీ రద్దీగా మారుతున్నాయి. బస్సుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉంది. లేకపోతే ఉన్న సిబ్బందిపై పనిభారం అధికంగా పడి వారంతా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంద'ని కండక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. 'గతంలో కేసీఆర్ హయాంలో ఎర్లీ డ్యూటీ విధానం అమల్లో ఉండేది. ఇప్పుడు అది పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. మహిళా కండక్టర్లు రిటైర్ అయిపోతే వారి స్థానంలో కొత్తగా మహిళా కండక్టర్లకే అవకాశం ఇవ్వాలి. అలా కాకుండా పురుషులను ఆ లిస్టులో చేరుస్తున్నారు.' అంటూ హయత్‌నగర్ కు చెందిన కండక్టర్ పేర్కొన్నారు.

అనారోగ్య సమస్యలతో సతమతం..

ఏకధాటిగా నిలబడి ఉండటం వల్ల మహిళలకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. టాయిలెట్ల సమస్య కూడా వారికి పెద్ద అవరోధంగా మారింది. ఈ పరిస్థితుల్లో వారు సరిపడా నీళ్లు తీసుకోలేక అనారోగ్యపాలవుతున్నారు. అంతేకాదు మహిళలు డబుల్ డ్యూటీలు చేయాలంటూ.. ఒత్తిడి తీసుకొస్తున్నారు. టార్గెట్‌లు పెట్టి సతాయిస్తున్నారని మహిళా కండక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సుమారు 3వేల మంది మహిళా కండక్టర్లు ఉన్నారు. గ్రేటర్‌లో సుమారు 16 వందల మంది ఉంటారు. సాధారణంగా వీరి విధులు సిటీలో అయితే 7 గంటలు, జిల్లాల్లో అయితే 8 గంటలు ఉండాలి. కానీ ప్రస్తుతం వారి విధులు ముగించుకునే సరికి మరో మూడు గంటలు అదనంగా ఉండాల్సిన దుస్థితి వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో విధులు నిర్వర్తించడం కష్టంగా ఉందని ఉన్నతాధికారుల వద్ద మొరపెట్టుకున్నా ఫలితం లేదని చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో టిమ్స్ ఆస్పత్రిని నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తేనున్నట్లు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చైతన్యపురి డివిజన్‌లోని గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్ స్థలంలో నిర్మిస్తున్న టిమ్స్ ఆస్పత్రి పనులను శనివారం ఆయన పరిశీలించారు. వైద్యశాల పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు తోట మహేశ్‌యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, పవన్, గట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. -ఎల్బీనగర్, జూలై 13